క్లుప్తంగా

విశ్వేశ్వరరావుకు ఘనంగా నివాళులు



విశ్వేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు

సారవకోట: సారవకోట ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తూ ఈ నెల 13న ధర్మవరపు విశ్వేశ్వర రావు మృతి చెందారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. విశ్వేశ్వరరావు చిత్రపటానికి ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆయన జ్ఞాపకార్థం మొక్కలు నాటారు. మండల ప్రత్యేకాధికారి వి.జయరాజ్, సారవకోట, ఎల్.ఎన్.పేట ఎంపీడీఓలు రేణుక, ఖాళీప్రసాద్, ఎంఈఓ ఎం.వి.రమణ, పలువురు సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

త్వరలో ప్రీ స్కూల్ పుస్తకాల పంపిణీ



ప్రాజెక్టు కార్యాలయంలో భద్రపర్చిన పుస్తకాలు

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుతున్న ప్రీ స్కూల్ పిల్లలకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలు మండల కేంద్రానికి సోమవారం చేరాయి. సారవకోట ప్రాజెక్టు కార్యాలయానికి సారవకోట, జలుమూరు మండలాల్లో గల 193 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్‌కు హాజరవుతున్న పిల్లలకు పంపిణీ చేసేందుకు 6804 పుస్తకాలు వచ్చాయి. దీంట్లో స్పోకెన్ ఇంగ్లిష్, మాథ్స్, ఇంగ్లిష్, యాక్టివిటీలతో కూడిన పుస్తకాలు వచ్చాయని సూపర్‌వైజర్ సుజాత తెలిపారు. వీటిని త్వరలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పంపిణీ చేస్తామన్నారు.

కలెక్టర్ దృష్టికి నరసన్నపేట సమస్యలు



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: నియోజకవర్గం పరిధిలోని ప్రధాన సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య కోరారు. శ్రీకాకుళం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, సమస్యలు పరిష్కారానికి హామీ ఇచ్చారని తెలిపారు. పోలాకి మండలం గుప్పెడిపేటలో అంగన్‌వాడీ కేంద్రం తెరవాలని కోరామన్నారు. నరసన్నపేట పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాల్సి ఉందని విన్నవించినట్లు తెలిపారు. వెంటనే డీపీఓకి ఆదేశాలిచ్చారన్నారు. వీటితో పాటు మరికొన్ని సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు.

గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పొందూరు: మండలంలోని ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు ఈ నెల 26 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీఓ సీపాన హరిహరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాణాం, ధర్మపురం, కింతలి, లోలుగు, మొదలవలస, పొందూరు, రాపాక, వీఆర్‌గూడెం గ్రామాల్లో గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ నెల 28న ఇంటర్వ్యూలు చేసి సెప్టెంబర్ 1న పోస్టింగ్‌లు ఇస్తామన్నారు.

వరుసగా వరినాట్లతో లాభం



వరుస క్రమంలో నాట్లు వేస్తున్న సిబ్బంది, రైతులు

జలుమూరు: వరినాట్లు వరుస క్రమంలో వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ మండల ఐసీఆర్పీలు సాయమ్మ, అమరావతి సూచించారు. మండల పరిధి గంగాధరపేటలో రైతు మెట్ట శరత్‌బాబుకు చెందిన వ్యవసాయ పొలంలో వరుసక్రమంలో వరినాట్లు వేసే పద్ధతిని సోమవారం ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఈ విధానం వల్ల విత్తనం ఖర్చుతోపాటు లేబర్ ఖర్చు తగ్గుతుందన్నారు. మొక్క అధికంగా పిలకలు పెడుతుందన్నారు. దీని వల్ల అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. మొక్కలకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడలు, కలుపు నివారణ సులువుగా చేయగలుగుతామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

నరసన్నపేట: అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అందించడం జరుగుతోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మేజరు పంచాయతీ నరసన్నపేటలోని లచ్చుమన్నపేట, తమ్మయ్యపేటల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చుమన్నపేటతో పాటు పరిసర వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటా ఆదరణ లభిస్తుందన్నారు. నరసన్నపేట మేజరు పంచాయతీలో ప్రజల ఆదరణ మరిచి పోలేనిదన్నారు. తమ్మయ్యపేట, లచ్చుమన్నపేటల్లో ఘన స్వాగతం పలికారు. ప్రజలు అందరూ వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని ఎమ్మెల్యే అన్నారు. కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, టీడీపీ నాయకుల విమర్శలు తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, ఎంపీటీసీ వైశ్యరాజు కేశవరాజు, పార్టీ నాయకులు సత్యానందరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

నిధులు ఎందుకు కేటాయించలేదు?

- మండల సమావేశంలో సభ్యుల వాకౌట్



ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యులు

హిరమండలం: మండల పరిషత్ అభివృద్ధి నిధులను గతంలో తీర్మానించిన గ్రామాలకు ఎందుకు కేటాయించలేదని ఎంపీడీఓ బి.శైలజను సభ్యులు ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన సోమవారం మండల సమావేశం నిర్వహించారు. వైస్‌ఎంపీపీ వంగపల్లి సావిత్రి, ఎంపీటీసీ సభ్యులు మీసాల రజిని, చింతాడ బుడ్డు, లుకలాపు సావిత్రి, అడపాక గురవమ్మ, మండల కో-ఆప్షన్ సభ్యుడు విష్ణు ప్రసాద్ పండాలు మాట్లాడారు. ఎంపీపీ, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు టి.తిరుపతిరావు నిధుల కేటాయింపులో ఇష్టానుసారంగా వ్యవహరించడంపై సమావేశం నుంచి వాకౌట్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈఓకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. జెడ్పీటీసీ పి.బుచ్చిబాబు ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు.. పంచాయతీకు కేటాయించిన 14, 15వ ఆర్థిక సంఘ నిధులను పంచాయతీ ఖాతాల్లో జమచేయాలని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం శాఖల వారీగా అధికారులతో సమీక్ష చేపట్టారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరు



పనులు ప్రారంభిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

జలుమూరు: శివారు భూములకు సాగునీరు అందించి, రైతులకు సాగునీటి కష్టాలు తీర్చేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. మండల పరిధి పర్లాం వద్ద 19ఆర్ పర్లాం కాలువ పూడికతీత పనులను సోమవారం ప్రారంభించారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ వద్ద ఆయా ప్రాంతాల రైతులు సాగునీటి కష్టాలు వివరించారన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారన్నారు. కలెక్టర్ నిధుల నుంచి రూ.45 వేలు, స్వంత నిధులు రూ.50 వేలు అందించి పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు కనుసు సీతారాం, సర్పంచ్‌లు తాడేల త్రినాథ్, పార్టీ నాయకులు రేగాన శ్యామ్, వెలమల అసిరి నాయుడు, ఆదిబాబు, పి.తివిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం..

- ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తా..
- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి



మాట్లాడుతున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, ఎవరూ అధైర్యపడొద్దని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని చీపురుపల్లి గ్రామంలో నిర్వాసితులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు సర్వే నిర్వహించిన సమయంలో కొంతమంది గ్రామాల్లో లేకపోవడం, కొన్నిసాంకేతిక కారణాల వల్ల ఆర్‌ఎండ్‌ఆర్ పేకేజీలు అందనివారు, ఇళ్ల స్థలాలు పొందనివారు ఉన్నారని చీపురుపల్లి సర్పంచ్ యవ్వారి ఈశ్వరరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. నిర్వాసిత గ్రామాల్లో పర్యటించి అధికారులు పొందుపరచిన సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి, వారికి మరింత లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నో ఎకరాలకు సాగునీరందించి రైతులు, ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనతో సొంత గ్రామాలు, ఇళ్లు, భూములు కోల్పోవడానికి సిద్ధమైనవారికి అన్ని విధాలా న్యాయం చేస్తామన్నారు. తహసీల్దార్ సరోజిని, ఆర్ఐ వైకుంఠరావు, జెడ్పీటీసీ గూడ ఎండయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, మండల నాయకులు డి.బాలరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న స్ఫూర్తి బృందం సభ్యులు

సరుబుజ్జిలి: నిరంతరం ప్రజలు అప్రమత్తంగా ఉన్నప్పుడే సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చునని స్ఫూర్తి పోలీస్ కళా బృందం సభ్యులు తెలిపారు. రొట్టవలస జెడ్పీ హైస్కూల్‌లో ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తం ఎలా అన్న అంశంపై సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, కార్యక్రమం సమన్వయకర్త కూన వనజాక్షి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కూలిన కల్వర్టు

- శిథిలాలను తొలగించిన అధికారులు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణ



కూలిపోయిన కల్వర్టు వద్ద చేపడుతున్న మరమ్మతు పనులు



పైపులు వేయిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి: అలికాం-బత్తిలి ఆర్‌అండ్‌బీ రహదారిలో చినషళంత్రి జంక్షన్ కోమటిచెరువు వద్ద గల రహదారి కల్వర్ట్ సగభాగం సోమవారం కూలిపోయింది. స్థానికులు వెంటనే పోలీస్ యంత్రాంగానికి సమాచారం అందించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు యంత్రాలను తీసుకువచ్చి శిథిలాలను తొలగించారు. ఆ ప్రదేశంలో కందకం మాదిరిగా తవ్వి కొత్తగా సిమెంట్ పైపులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా వాహనాలను సరుబుజ్జిలి నుంచి బూర్జ మండలం మదనాపురం జంక్షన్ మీదుగా పాలకొండ రోడ్డులో ఆమదాలవలస, శ్రీకాకుళం రహదారికి మళ్లించారు. ద్విచక్ర వాహనదారులు మూలసవలాపురం జంక్షన్ నుంచి సింధువాడ, వీరమల్లిపేట, పెదవెంకటాపురం మీదుగా రొట్టవలస జంక్షన్‌కు చేరుకున్నారు.

ఆర్‌అండ్‌బీ నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం....

బ్రిడ్జిలు, కల్వర్టులు కూలినంత వరకు ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడంలేదని, రహదారి కల్వర్టు దుస్థితిపై పలుమార్లు పత్రికల్లో కథనాలు వచ్చినా, ఫిర్యాదులు చేసినా పట్టకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నించారు. సమస్య చిన్నదిగా ఉన్నప్పుడు స్పందిస్తే ఈ పరిస్థితి వచ్చేదికాదన్నారు.

రాకపోకలు పునరుద్ధరణ...

కూలిన కల్వర్ట్ ప్రదేశంలో కొత్తపైపులు, కాంక్రీట్ ఏర్పాటుచేసి పునర్నిర్మించడం జరిగినట్లు ఆర్‌అండ్‌బీ జేఈ ఆంజనేయనాయక్ తెలిపారు. వాహనాల రాకపోకలు కూడా పునరుద్ధరించామని వెల్లడించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కొత్తూరు: సమగ్ర శిక్ష పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెగ్యులర్ చేయటంతోపాటు జీతాలు పెంచాలని కోరుతూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో పలువురు ఉద్యోగులు సోమవారం నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్, స్వప్న, అప్పలనాయుడు, గోవింద్, వెంకటరావు, బిందు, సంతోషి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

లబ్బలో వైఎస్సార్ పొలంబడి



రైతులకు అవగాహన కలిగిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు: ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులు పాటించాలని కొత్తూరు మండలం ఎంటీ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరు మండలం లబ్బ గ్రామంలో రైతులతో కలిసి వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నీమాస్త్రం తయారీపై అవగాహన కల్పించారు. వరి పంటకు ఆశించే పురుగుల నివారణ కోసం లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు, పసుపు అట్టలు పొలంలో ఏర్పాటు చేసుకోవటం వల్ల అనేక రకాల పురుగులు వాటిని ఆకర్షించి చనిపోతాయని, తెగుళ్ల నివారణ సాధ్యం అవుతుందన్నారు. పొలం గట్లుపై ఆముదం, కూరగాయలు, కంది మొక్కలు వేసుకోవాలని సూచించారు. పకృతి వ్యసాయ సిబ్బంది మన్మథరావు, జగన్, లలిత, రామారావు, మోహిని, ఆనందరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచెంద్రి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ వెంకటేష్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: మండలంలోని పాతపట్నం, రొంపివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పాతపట్నం, బూరగాం, కొరసవాడ, కాగువాడ, రొంపివలస, రొమదల, తిడ్డిమి, తీమర, తామర, సోద, ఎఎస్ కవిటి, రంకిని, సరాలి, కమలమ్మ కొట్టు తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

హిరమండలంలో..

హిరమండలం: మండలం వ్యాప్తంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు సోమవారం ప్రకటించారు. విద్యుత్ వైర్లు సరిచేయటం, మరమ్మతు పనులు చేపట్టడం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

బోరు బాగుచేయాలని వినతి



పాడైన తాగునీటి బోరు

సారవకోట: మండల కేంద్రంలోని కర్లం వీధిలో తాగునీటి బోరును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వీధిలో సుమారు 110 కుటుంబాలకు ఒకే బోరు ఉందన్నారు. గత పది రోజుల నుంచి తాగునీటి బోరు మరమ్మతులకు గురైందన్నారు. దీంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలన్నారు.

- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ఎస్టీలకు సామాజిక, రాజకీయ ప్రాధాన్యత కల్పించడంతోపాటు, కుంభా రవిబాబుకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం అభినందనీయమని సైకత శిల్పి గేదెల హరికృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఆమదాలవలస మండలంలోని గాజులకొల్లివలస గ్రామం సమీపంలో గల సంగమేశ్వర ఆలయం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుంభా రవిబాబుల సైకత శిల్పాలను తీర్చిదిద్దాడు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశాడు.

– ఆమదాలవలస రూరల్

ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట (కొత్తూరు): ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కొత్తూరు మండలం దిమిలి గ్రామంలో సోమవారం కిడ్నీ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగుల ఇంటి వద్దకు వైద్య సేవలు అందేలా ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోందని వివరించారు. ఉద్దానం కిడ్నీ బాధితులను ఆదుకునేందుకు ప్రత్యేక వాటర్ పైప్ లైన్లు ఏర్పాటుతోపాటు కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిని ఏర్పాటు చేయటం జరుగుతుందని వివరించారు. కిడ్నీ బాధితులను ప్రతీ నెల రూ.10 వేల పింఛన్ డబ్బులు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయం పరిధిలో హెల్త్ వెల్త్ కేంద్రాలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కొత్తూరు పీఏసీఎస్ ఛైర్మన్ చింతాడ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గూడ ఎండయ్య

మెళియాపుట్టి: ఉపాధివేతనదారుల ఖాతాలలో నేరుగా వేతనాలు జమ కావడంతోపాటు, పనిచేసిన వేతనదారుల సంఖ్య, చేసిన పని ఇలా అన్ని వివరాలు ప్రతీరోజు మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారని, అలాగే పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఇతరత్రా పనులు కూడా పారదర్శకంగా జరుగుతున్నాయని, ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేదని జెడ్పీటీసీ గూడ ఎండయ్య అన్నారు. మండల ఉపాధి కార్యాలయంలో సోమవారం సామాజిక తనిఖీ బృందం పలుశాఖల సిబ్బందితో నిర్వహించిన సమన్వయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లోకు వెళ్లి తనిఖీ నిర్వహించేటప్పుడు అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తనిఖీ బృందం సభ్యులకు క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు సహకరిస్తారని, సక్రమంగా తనిఖీ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఎంపీడీఓ చంద్రకుమారి, ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, ఎస్ఆర్పీ రమణ, డీఆర్పీలు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

- కుంకుమార్చనలు



నరసన్నపేటలోని కల్యాణ మండపంలో రామ్‌రామ్ గురూజీ ఆధ్వర్యంలో అష్టలక్ష్మి కుంకుమార్చనలు సోమవారం చేపట్టారు. గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. లోక కల్యాణార్థం ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు రామ్‌రామ్ గురూజీ తెలిపారు. ప్రతిరోజూ 116 మంది మహిళలు ఈ పూజల్లో పాల్గొంటున్నారు.

– నరసన్నపేట

ఎన్నికలు ఏవైనా వైఎస్సార్‌సీపీదే విజయం



గెలుపొందిన వార్డు సభ్యులతో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తూ వస్తుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం క్యాంప్ కార్యాలయం వద్ద ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచిన వార్డు సభ్యులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గంలో పాతపట్నం, మెళియాపుట్టి, ఎల్.ఎన్.పేట, కొత్తూరు మండలాల్లోని పలు గ్రామ పంచాయతీల్లో 12 వార్డులకు జరిగిన ఎన్నికల్లో పది వార్డులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా గెలిచారన్నారు. సీఎం జగన్‌కు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల ఆదరణ పొందాయని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయానికి సంక్షేమ పథకాలే అండగా నిలుస్తాయన్నారు. పార్టీ నాయకులు రెడ్డి రామారావు, ఈగల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.